సాక్షి
ఒడిశా
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,01,754లు, బంగారం 500 మిల్లీగ్రాములు, వెండి 68గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



దయనీయ స్థితిలో..

పశువైద్య కేంద్రం దయనీయ స్థితిలో ఉంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

- 8లో



అక్రమాలు అరికట్టాలి

గజపతి జిల్లాలో ఆహార కమిషన్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. సూచనలు ఇచ్చారు.

- 8లో

విద్యార్థుల్లో .. భద్రతాసంస్కృతి పెంపొందించాలి



రాజ్ భవన్ సమావేశం హాల్‌లో అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం విపత్తు సన్నద్ధత సమావేశంలో గవర్నర్

భువనేశ్వర్: విపత్తు నిర్వహణలో భద్రత సంస్కృతి అత్యంత కీలకమని, ఆ సంస్కృతిని సిబ్బందితో విద్యార్థి వర్గంలో ప్రేరేపించడం అవాంఛనీయ సంఘటనల నివారణకు దోహదపడుతుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి తెలిపారు. ఉన్నత విద్యా శాఖ పరిధిలోని అన్ని సంస్థల్లో అగ్నిమాపక చర్యల ఆడిట్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖను కోరారు. ఈ చర్య ఊహాతీత ప్రమాదాలపై సకాలంలో పటిష్టంగా స్పందించేందుకు సహకరిస్తుంది. విపత్కర పరిస్థితుల్లో క్షతగాత్రులు మృత్యు సంఘటనల్ని నివారించేందుకు నిరంతర తనిఖీ (ఆడిట్) అనివార్యంగా పేర్కొన్నారు. రాజ్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అగ్నిమాపక, అత్యవసర సేవల విభాగం విపత్తు సన్నద్ధత, ప్రతిస్పందనపై వివరణాత్మక ప్రదర్శన సందర్భంగా గవర్నరు పలు కీలక మార్గదర్శకాలను సూచించారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్, అగ్నిమాపక, అత్యవసర సేవలు, హోమ్ గార్డ్ శాఖ డీజీ తదితర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా అగ్ని మాపక వ్యవస్థ ప్రస్తుత స్థితిగతులు, శిక్షణ తదితర భావి ప్రణాళికలు, కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రోబోటిక్ మానిటర్లు, అడ్వాన్స్‌డ్ రెస్క్యూ టెండర్లు, ఇన్సిడెంట్ కమాండ్ వెహికల్స్, హైడ్రాలిక్ ప్లాట్‌ఫారమ్, ఇతర అధునాతన యంత్రాలతో కూడిన ఆధునిక పరికరాలను ప్రదర్శించారు. పూరీ జిల్లా రామచండి ప్రాంతంలో నేషనల్ వాటర్ రెస్క్యూ, వాటర్‌మ్యాన్‌షిప్ సెంటర్, కే–9 జాగిలాల స్క్వాడ్ మోహరించడంలో ఒడిశా దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలిచిందని అధికారులు గవర్నర్‌కు వివరించారు. అగ్నిమాపక లైసెన్సు మంజూరు, పరోక్ష వర్గాలు (థర్డ్ పార్టీ) భాగస్వామ్యం, రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర విపత్తు సన్నద్ధత కార్యకలాపాల్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవడం శాఖ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

ఎరువుల కోసం రోడ్డెక్కిన రైతులు



ఎరువుల కోసం నయాగడ్ ప్రాంతంలో రైతుల ఆందోళన

- కేంద్ర మంత్రికి నవీన్ లేఖ
- ఎరువుల నిల్వలు పుష్కలం: వ్యవసాయ మంత్రి

భువనేశ్వర్: సాగుకాలంలో ఎరువుల కొరత రాష్ట్ర రైతులను వేధిస్తుంది. పలు చోట్ల ఎరువుల కోసం రైతులు వీధికి ఎక్కి నిరసన ప్రదర్శిస్తున్నారు. ప్రధానంగా దళిత ప్రభావిత ప్రాంతాల్లో ఈ ఎరువుల కొరత తీవ్రత మరింత అధికంగా కొనసాగుతోంది. నయాగడ్ జిల్లా గొడిపొదా గ్రామంలో రైతాంగం యూరియా తదితర ఎరువుల కోసం వీధికి ఎక్కి నడి రోడ్డు మీద బైఠాయించారు. వాహనాల రవాణా స్తంభింపజేయడం జన జీవనం పాక్షికంగా ప్రభావితమైంది. కిసాన్ సభ ఆధ్వర్యంలో రైతులు ఈ ఆందోళన చేపట్టారు.

విపక్షం ప్రతిస్పందన

ఎరువుల కోసం రైతుల ఇక్కట్ల పట్ల రాష్ట్రంలో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ సమయానుకూలంగా ప్రతిస్పందించింది. రాష్ట్ర రైతాంగానికి ఎరువుల కొరత నివారించే దిశలో సత్వర చర్యలు చేపట్టాలని విపక్ష నేత, బిజూ జనతా దళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాశారు. లక్షలాది మంది రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని తొలగించే దిశలో క్షేత్రస్థాయిలో పరిస్థితి తీవ్రతను సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఎరువుల సరఫరాలో విస్తృతమైన అవకతవకలు, బ్లాక్ మార్కెట్, కల్తీ, మార్కెట్‌లో యూరియా కృత్రిమ కొరత వేధింపులకు సంబంధించి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రికి రాసిన లేఖలో సమగ్ర పరిస్థితిని వివరించినట్లు బిజూ జనతా దళ్ ప్రకటించింది. రాష్ట్ర రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి అవసరమైన ఎరువులు తక్షణమే సరఫరాను చేయాలని నవీన్ పట్నాయక్ ఒత్తిడి చేశారు.

రాష్ట్రంలో ఎరువుల నిల్వలు పుష్కలం

రాష్ట్రంలో సాగు పనులకు అవసరమైన ఎరువుల నిల్వ పుష్కలంగా కొనసాగుతుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వ్యవసాయం, రైతు సాధికారిత విభాగం మంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ ఎరువుల సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నారు. రాష్ట్రంలో తగినంత ఎరువుల నిల్వ ఉందని వివరించారు. ఈ సీజనులో రైతులకు వివిధ రకాల ఎరువుల 8.46 లక్షల మెట్రిక్ టన్నులు విక్రయించినట్లు తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, నకిలీ ఎరువుల అమ్మకాలను అరికట్టడానికి క్షేత్ర స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తరచూ దాడులు నిర్వహిస్తున్నాయి. అక్రమార్కుల వ్యతిరేకంగా ఆ బృందాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అవకతవకలకు పాల్పడిన 1,202 మంది రిటైల్ డీలర్లకు వివరణ కోరుతు ఉత్తర్వులు జారీ చేశారు. 30 దుకాణాలలో అమ్మకాలు నిలిపివేతకు ఆదేశించారు. 62 మంది డీలర్ల లైసెన్స్‌లను సస్పెన్షన్, రద్దు చేసేందుకు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో ఎరువులకు కొరత లేదు. పుష్కలంగా నిల్వ కొనసాగుతుంది. ఈ సీజన్ కోసం 11.04 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువుల నిల్వ అందుబాటులో ఉందని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. దీనిలో ఇప్పటి వరకు 8.46 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతులకు విక్రయించారు. గత ఖరీఫ్ సీజనులో ఈ వ్యవధిలో 7.03 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే రైతాంగానికి చేరినట్లు ప్రకటనలో పేర్కొంది. రానున్న 2 రోజుల్లో 11,692 మెట్రిక్ టన్నుల యూరియా పీఏసీ, ల్యాంప్‌ల ఆధ్వర్యంలో రైతాంగానికి చేరుతుందని వ్యవసాయ శాఖ రాష్ట్రంలో రైతులకు హామీ ఇచ్చింది. భారత ప్రభుత్వం, ఎరువుల కంపెనీల సమన్వయంతో రాష్ట్ర రైతాంగానికి సరసమైన ధరలకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందజేసేందుకు రాష్ట్ర శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌తో ముఖ్యమంత్రి భేటీ



కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌తో ముఖ్యమంత్రి చర్చ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి గురువారం న్యూ ఢిల్లీలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా పర్యావరణం, అటవీ సంరక్షణ, వాతావరణ స్థితిస్థాపకత, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలతో ఒడిశాకు సంబంధించిన అనేక అంశాలపై వారు చర్చించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

సోషల్ మీడియాలో శ్రీమందిరం ఫొటోలు



శ్రీమందిరం లోపలి ప్రాకారంలో ఫొటోలతో పర్యాటకుడు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని ఆలయం లోపలి ప్రాకారం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం దుమారం రేగుతోంది. దీంతో మరోసారి శ్రీమందిరం రక్షణ, భద్రత వ్యవస్థ ప్రశ్నార్థకమైంది. శ్రీమందిరం లోపలి ప్రాకారంలో తీసుకున్న ఫొటోని పర్యాటకుడు ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. పర్యాటకుడు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు.

వంతెన నిర్మించాలని వినతి



వినతిపత్రంతో ఖర్బడి పంచాయతీ ప్రజలు

పర్లాకిమిడి: జిల్లాలోని మోహనా బ్లాక్ మారుమూల ప్రాంతం ఖర్బడి గ్రామ పంచాయతీలో 15 గ్రామాలకు హారభంగి నదిపై వంతెన లేకపోవడం వలన వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని ఆయా గ్రామస్తులు కలెక్టరేట్‌లో గురువారం వినతిపత్రం అందజేశారు. హారభంగి నదికి ఆనుకుని ఉన్న రజామా, ఖరికువా, హాలాబడి, గలమా, కుటిగుడ, రటమా, రాకేష్ పంకా, ఖోజురిపద, కోంద అడవా, గోపిమా, పరమంగాల గ్రామాలకు వంతెన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అందువలన వెంటనే హారభంగి నదిపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ విషయంపై పలుమార్లు వినతుల అందజేశామని గుర్తు చేశారు. కలెక్టర్‌ను కలిసినవారిలో ఖర్బడి పంచాయతీ సమితి సభ్యులు టునా మల్లిక్, సర్పంచ్ రాజా మల్లిక్, రవీంద్ర మల్లిక్ తదితరులు ఉన్నారు.

పాముకాటుతో బాలుడు మృతి



దశమంత్ మృతదేహం

దశమంత్ (ఫైల్)

రాయగడ: పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి దేవేంద్ర కౌసల్యకు చెందిన 12 ఏళ్ల కుమారుడు దశమంత్ కౌసల్యగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో విషపూరితమైన పాము దశమంత్‌ను కాటు వేసింది. దీంతో కేకలు పెట్టిన బాలుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఆత్మాహుతి చేసుకున్న మహిళ మృతి

భువనేశ్వర్: కటక్ జిల్లా సలేపూర్ ప్రాంతంలో ఆత్మాహుతికి పాల్పడిన మహిళ మృతి చెందారు. సలేపూర్ ప్రాంతం కాంక్రైయిలో గ్రామంలో కుటుంబ కలహాలతో మహిళ మంగళవారం ఆత్మాహుతికి పాల్పడింది. చికిత్స కోసం కటక్ ఎస్సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం తుది శ్వాస విడిచింది.

మహానదిలో పెరుగుతున్న నీటి మట్టం



ఉప్పొంగుతున్న మహా నది



పొంగి పొర్లుతున్న వైతరణి

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు చోట్ల తెరిపి లేకుండా కురుస్తున్న వానలతో ప్రముఖ నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. ప్రధానంగా మహా నదిలో నీటి మట్టం ఉరకలేస్తోంది. అయితే వరద ముంపు తీవ్రత లేదని జల వనరుల విభాగం ప్రముఖ ఇంజినీర్ చంద్ర శేఖర పాఢి తెలిపారు. మరో వైపు వైతరణి నది కూడ పొంగి పొరలుతుంది. గత 3 నెలల్లో వైతరణిలో వరద ఉధృతి తారస పడడం వరుసగా ఇది మూడోసారి అని జల వనరుల శాఖ ప్రముఖ ఇంజినీర్ పేర్కొన్నారు. 14 మండలాల్లో 100 మిల్లీ మీటర్ల పైబడి, 42 మండలాల్లో 50 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఎగువ మహా నది, వైతరణి, బుఢాబొలాంగొలో అధిక వర్షపాతం నమోదైంది. వైతరణిలో నామ మాత్రపు వరద పరిస్థితి తారసపడుతుంది. అఖువాపాడా తీరంలో వైతరణి నదిలో నీటి మట్టం ప్రమాద సంకేతం అధిగమించి 0.5 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. వరద విపత్తు నిర్వహణ సన్నద్ధతతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. హిరాకుద్ జలాశయంలో 14 గేట్లు తెరిచి వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీని ప్రభావంతో లోతట్టు మహా నదిలో నీటి మట్టం పెరుగుతుంది. వరదలు సంభవించవని జల వనరుల శాఖ స్పష్టం చేసింది.

వైభవంగా గజపతి సునియా ఉత్సవం



పూరీ గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్

భువనేశ్వర్: గురువారం నుంచి పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ పాలన 69వ సంవత్సరం ప్రారంభమైంది. మరో వైపు ఉత్కళీయ సంవత్సరం 1433 ఆరంభం కావడం విశేషం. ఈ సందర్భంగా ఏటా పవిత్ర భాద్రపద శుక్ల పక్ష ద్వాదశి నాడు గజపతి రాజ భవనంలో ప్రత్యేకంగా సునియా ఉత్సవం జరుపుకోవడం ఆచారం. ఈ సందర్భంగా గజపతి రాజ నగరి ప్రాంగణంలోని కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గ, శ్యామ కాళి, రాధాకృష్ణ, నృసింహ తదితర దేవతలను గజపతి మహారాజా పూజించారు. దీన్ని గజపతి దేవార్చనగా పేర్కొంటారు. దేవార్చన తర్వాత మంగళ హారతి సమర్పించి సునియా ప్రత్యేక ఉత్సవం ప్రారంభించారు. ఈ ఉత్సవం పురస్కరించుకుని గజపతి మహారాజా సమక్షంలో కొత్త అంకం ఆవిష్కరణ జరిగింది, ఈ సందర్భంగా రాజ గురువు ఆధ్వర్యంలో గజపతి రాజ నగరి తరపున వరాహ నృసింహ, లక్ష్మీ నృసింహ చిహ్నాలతో కూడిన కొత్త బంగారు నాణెం ప్రవేశపెట్టారు.

చంపాకు కలెక్టర్ అభినందనలు



చంపాకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్



అంబేలిబేఢ గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి అంబలిబేఢ గ్రామానికి గురువారం కలెక్టర్ సోమేష్ ఉపాధ్యాయ్ స్వయంగా వెళ్లి ఆదిమ తెగకు దిదాయి తెగకు చెందిన చంపా రస్‌పెడ అనే యువతిని అభినందించారు. ఆమె నీట్ పరీక్షల్లో స్థానం సాధించిన విషయం విదితమే. ఆమెకు శుభాకాంక్షలు తెలపడంతో పాటు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ.30 వేలు నగదు చెక్‌ను అందజేశారు. అలాగే ఓ మొబైల్ ఫోన్, దుస్తులు కూడా ఇచ్చారు. ఆమె తండ్రి సదరణ కాజు రైతుగా పని చేస్తూ ఎంతో కష్టపడి పిల్లలను చదివించారు. ఆమె నీట్‌కు ఎలా ప్రిపేర్ అయ్యిందో కలెక్టర్ తెలుసుకున్నారు. చదువు పూర్తయ్యాక తన గ్రామానికి వైద్య సేవలు అందిస్తానని ఆమె తెలిపారు.

ఉత్సాహంగా వినాయక ఉత్సవాలు



లక్ష పుష్పార్చనలో మహిళలు



పిండివంటలతో నిర్వాహకులు



కాళీ వేషధారణలో కళాకారులు



శక్తిరూపిణి మహాకాళి అవతారంలో కళాకారుడు

రాయగడ: పట్టణంలో వినాయక ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా స్థానిక న్యూకాలనీలో వినాయక చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో గురువారం లక్ష పుష్పార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వేద పండితులు రేజేటి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో మహిళలు పాల్గొని పుష్పార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పిండివంటలను గణనాథునికి నైవేద్యంగా సమర్పించారు.

కొత్తపేటలో..

వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని కొత్తపేటలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వేషధారణలు ఆకట్టుకున్నాయి. పులివేషాలు, శక్తి రూపిణి, కాళి వంటి వేషాలతో నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

‘గనుల తవ్వకాలు అడ్డుకుంటాం’



డీఐజీ విశాల్ సింగ్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

కొరాపుట్: గనుల తవ్వకాలను అడ్డగిస్తామని అఖిల పక్షం హెచ్చరించింది. గురువారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఉన్నత స్థాయి అధికారులను కలసి లేఖలు అందజేసింది. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కొడింగా మాలిలో బాక్సైట్ గనుల తవ్వకాలు అడ్డుకుంటామని ముందస్తు ప్రకటన చేసింది. గతంలో ఈ ప్రాంతంలో గనుల తవ్వకాలు ముందు వేదాంత సంస్థ అనేక హామీలు ప్రజల ముందు ఉంచిన విషయం గుర్తు చేసింది. ఈ ప్రాంతంలో 3 లక్షల మిలియన్ మెట్రిక్ టన్నుల తవ్వకాలకు అనుమతి ఉండేదని, అది ప్రస్తుతం 6 లక్షల మిలియన్ మెట్రిక్ టన్నుల బాక్సైట్ తవ్వకాలకు అనుమతి సాధించిందన్నారు. ఇదే ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి పరిశ్రమని వేరే చోట ఏర్పాటు చేసిందన్నారు. అంతే కాక నిత్యం ఇక్కడ నుంచి గనులు తవ్వకొని వేరే ప్రాంతానికి తరలిస్తున్నారని తెలిపారు. ఇక్కడ వారికి ఉపాధి కూడా ఇవ్వకపోగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలో ఖర్చు పెట్టాల్సిన పెరి ఫెరి డెవలప్‌మెంట్ నిధులు ఈ ప్రాంతంలో వినియోగించడం లేదన్నారు. అందుకే ఈ నెల 10వ తేదీ నుంచి ఈ ప్రాంతం లో నిరవధిక బంద్ నిర్వహిస్తామని ప్రకటించారు. అందుకు తగ్గ లేఖలను సదరన్ వెస్టర్న్ రేంజ్ డీఐజీ కన్వర్ విశాల్ సింగ్, కొరాపుట్ కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, ఎస్పీ రోహిత్ వర్మకి లేఖలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్‌కు చెందిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత, బీజేడీకి చెందిన మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మాజీ ఎమ్మెల్యే పవిత్ర శాంత తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్ కలెక్టర్ మహాజన్‌కి లేఖ అందిస్తున్న దృశ్యం



ఎస్పీ రోహిత్ వర్మతో అఖిల పక్షం సమాలోచనలు



కొరాపుట్‌లో ఆందోళన చేస్తున్న అఖిల పక్షం సభ్యులు

క్లుప్తంగా

గంజాయి కేసు నిందితుడు నిర్దోషి

- గుణుపూర్ ఎస్‌డీజేఎం దేవదత్త పట్నాయక్ తీర్పు వెల్లడి

రాయగడ: గంజాయి కేసుకు సంబంధించి గుణుపూర్ ఎస్‌డీజేఎం దేవదత్త పట్నాయక్ నిందితుడిని నిర్దోషిగా తీర్పునిచ్చారు. విచారణకు వచ్చిన ఈ కేసు పూర్వాపరాలు విన్న ఆయన సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో నిందితుడిని నిర్దోషిగా తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా.. జిల్లాలోని పద్మపూర్ సమితి నువాగడకు చెందిన సురేష్ మాఝి అనే వ్యక్తి 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో, అదేవిధంగా మరో 20 ఎకరాల తన సొంత భూమిలో గంజాయి సాగు చేస్తుండేవాడు. ఈ క్రమంలో 2018లో అబ్కారీ, పోలీస్‌శాఖలకు చెందిన అధికారులు గంజాయి సాగుపై దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను పసిగట్టిన నిందితుడు సురేష్ అక్కడ నుంచి పారిపోయాడు. దీంతో అధికారులు గంజాయి సాగును ధ్వంసం చేయడంతో పాటు సురేష్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేసిన పోలీసులు ఏడాది తరువాత సురేష్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం గుణుపూర్ ఎస్‌డీజేఎం కోర్టులో విచారణకు రాగా.. సరైన సాక్ష్యాధారాలు లేని కారణంతో నిందితుడుని నిర్దోషిగా కోర్టు తీర్పును వెలువరించింది.

బీజేడీ మహిళా అధ్యక్షురాలు స్నేహంగిని చురియా



స్నేహంగిని చురియా

భువనేశ్వర్: బిజూ మహిళా జనతా దళ్ అధ్యక్షురాలిగా స్నేహంగిని చురియాను ప్రకటించారు. దళంలో మహిళల వ్యవహారాల పర్యవేక్షణ కోసం మరో 15 మంది మహిళలకు ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆమోదంతో ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా జగన్నాథ సరక



జగన్నాథ సరక

రాయగడ: బీజేడి జిల్లా అధ్యక్షునిగా రాష్ట్ర మాజీ మంత్రి జగన్నాథ సరక నియమితులయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, బీజేడి అధినేత నవీన్ పట్నాయక్ ఈ మేరకు గురువారం శంఖభవన్ నుంచి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల, రంజిత్ కుమార్ పాణిగ్రహి నియమితులైనట్లు ప్రకటనలో పేర్కొన్నారు. గత కొద్ది నెలలుగా జిల్లా అధ్యక్షుని నియమకానికి సంబంధించి ఉన్న ఉత్కంఠతకు తెరపడింది. పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా బీజేడీ హయాంలో సరక రెండుసార్లు మంత్రి పదవిని అలంకరించారు. ఆయన నియమకానికి సంబంధించి పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు అభినందించారు.

శ్రీ మందిరంలో గరుడ పార్శ్వ పరివర్తన ఉత్సవం



భువనేశ్వర్: పవిత్ర భాద్రపద శుక్ల పక్ష ద్వాదశి తిథి పురస్కరించుకుని గురు వారం పూరీ శ్రీ మందిరంలో గరుడ పార్శ్వ పరివర్తన ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ధూపం తర్వాత పూజా పండా సేవకులు గరుడుడికి పంచామృత మహా స్నానం చేయించి నూతన వస్త్రాలు .ధరించారు. ఖుద్ధొ సువారొ సేవకులు పూజాదులు నిర్వహించి శీతల భోగం నివేదించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి తీవ్ర గాయాలు

మెళియాపుట్టి : మారడికోట పంచాయతీ సవర చీడిపాలెం గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. సవర భాస్కరరావు తన ఇంటి మేడ పైకి వెళ్లి కరెంట్ తీగలను కదపడంతో షాక్‌కు గురై హైటెన్షన్ వైర్లకు అతుక్కుపోయాడు.వెంటనే గ్రామస్తులు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి సరఫరా నిలిపివేయడంతో కింద పడిపోయాడు. బాధితుడిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లోచేర్పించారు. అయితే కరెంట్ తీగలను ఎందుకు కదపడానికి వెళ్లాడు అనే దానిపై స్పష్టత లేదు. భాస్కరరావు భార్య మూడేళ్ల కిందటే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

మాదకద్రవ్యాల రవాణాపై పటిష్ట నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ వర్మ

జయపురం: కొరాపుట్ జిల్లాలో పెరుగుతున్న గంజాయి, గుట్కా, సిగరెట్లు తమాకె (పొగాకు) తదితర మాదక ద్రవ్యాల అమ్మకాలు, వాడకం, రవాణాను అరికట్టేందుకు ఆపరేషన్ ప్రహార్ అభిజాన్ చేపట్టామని కొరాపుట్ పోలీసు ఎస్పీ రోహిత్ వర్మ వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ సభాగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా ఇంతవరకు పలు దాడులు నిర్వహించి గంజాయి, గుట్కా, పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నామన్నారు. ముఖ్యంగా ధార్మిక, విద్యాసంస్థల పరిసరాల్లో మాదక ద్రవ్యాలు అమ్మకాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. జయపురంలో ఇద్దరు గుట్కా వ్యాపారుల గిడ్డంగులపై దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున గుట్కా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఆ ఇద్దరు వ్యాపారులపై గతంలో పలుమార్లు దాడులు నిర్వహించి గుట్కా పట్టుకున్నామన్నారు. వారిపై కఠిన చర్యలు చట్టపరంగా తీసుకుంటామని వెల్లడించారు. ఆపరేషన్ ప్రహార్‌లో కొరాపుట్ జిల్లా కక్కిరిగుమ్మ పోలీసులు 394.900 కేజీల గంజాయి పట్టుకున్నారని వెల్లడించారు. మంగళవారం సెమిలిగుడ పోలీసులు 32 కేజీల గంజాయి పట్టుకున్నామన్నారు. జయపురం పట్టణ పోలీసులు గురువారం 5 కేజీల గంజాయి పట్టుకున్నట్లు వెల్లడించారు. జయపురం సబ్‌డివిజన్ పోలీస్ అధికారి పార్థ జగదీష్ కాశ్యప్, పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్, వైద్య విభాగ ఉద్యోగి సత్యనారాయణ పాల్గొన్నారు.

భువనేశ్వర్‌కు కమ్యూనిస్టు ప్రతినిధులు



భువనేశ్వర్‌కు బయలుదేరిన రైతులు

జయపురం: భారతీయ కమ్యూనిస్టు పార్టీ శతజయంతి వేడుకల సందర్భంగా భువనేశ్వర్‌లో మూడు రోజులు జరుగనున్న కమ్యూనిస్టు పార్టీ 24వ రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు జిల్లా నుంచి 500 మందికి పైగా ప్రతినిధులు బుధవారం రాత్రి జయపురం రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరారు. వారిలో పలు గ్రామాల నుంచి రైతులు, మహిళలు ఉన్నారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రామకృష్ణ దాస్ నేంతృత్వంలో భువనేశ్వర్ వెళ్లారు. రామకృష్ణదాస్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి 24వ సమావేశాలు గురువారం ప్రారంభమై శనివారం వరకు మూడు జరుగుతాయని వెల్లడించారు. పార్టీ జాతీయ సాధారణ కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ సాధారణ కార్యదర్శి అమరజిత్ కౌర్, జాతీయ కార్యవర్గ సభ్యులు రామ కృష్ణ పండా, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి ఆశిష్ కనుంగొ హాజరవుతారన్నారు.

27 మందికి హైదరాబాద్‌లో శిక్షణ



శిక్షణకు ఎంపికైన యువతీ, యువకులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా నుంచి 27 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో గల అమిగోస్ సోల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ప్లేస్‌మెంట్ లింక్డ్ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్టు జిల్లా ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆమోద అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి గురువారం తెలియజేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మధుమితను కాశీనగర్, పర్లాకిమిడి, గుమ్మా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ, యువకులు కలిసి ఉపాధి లెటర్‌లను అందుకున్నారు. జిల్లాలో చదువు మధ్యలో ఆపివేసిన యువతీ, యువకులను శిక్షణకు ఎంపిక చేసినట్టు కలెక్టర్ తెలియజేశారు. అనంతరం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాదులో అమిగోస్ సోల్యూషన్స్‌లో లాజిస్టిక్స్, ప్యాకేజింగ్‌పై 3 నెలల పాటు వీరికి శిక్షణ అందిస్తారన్నారు. అనంతరం అదే కంపెనీలో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. శిక్షణ సమయంలో భోజనం, ఇతర వసతులు కంపెనీ కల్పిస్తుందన్నారు.

చోరీకి గురైన బైకులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

పొందూరు: చోరీకి గురైన నాలుగు బైకులను, ఓ లగేజీ ఆటోను టెక్నాలజీ సాయంతో స్వాధీనం చేసుకున్నామని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. పొందూరు పోలీసుస్టేషన్ పరిధిలో చోరీకి గురైన వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాల్లో కార్డన్‌సెర్చ్ చేస్తున్న సమయంలో తమ బైకులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. బైక్‌ను పోగొట్టుకున్న యజమాని ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా సాంకేతికతను ఉపయోగించుకుని బైక్‌లు స్వా. దీనం చేసుకున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం మంగువారి తోటకు చెందిన బొమ్మలాట మోహనరావు, బొమ్మలాట ఢిల్లీశ్వరరావు, తోట శ్రీనివాసరావు, మెండ శివలు వాహనాలు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. వీరిలో బైకు దొంగతనం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న మోహనరావు మూడు ద్విచక్రవాహనాలను, ఢిల్లీశ్వరరావు ఒక ద్విచక్రవాహనాన్ని చోరీ చేసినట్లు తెలిపారు. తోట శ్రీనివాసరావు, మెండ శివలు కొత్తూరులో చోరీ చేసిన లగేజి ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇటువంటి చోరీ చేసిన వాహనాలను ఢిల్లీశ్వరరావు కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడని తెఇపారు. నాలుగు ద్విచక్రవాహనాలు, లగేజి ఆటోను ఢిల్లీశ్వరరావు నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ వాహనాలన్నీ పొందూరు మండలం రాపాక గ్రామసుతలకు చెందినవిగా గుర్తించామని చెప్పారు. జైలులో ఉన్న మోహనరావును పూర్తి స్థాయిలో విచారిస్తే మరికొన్ని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొనే అవకాశం ఉందన్నారు. చోరీకి గురైన వాహనాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్సై వి.సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు. డీఎస్పీతో పాటు సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణ, ట్రెనీ ఎస్ఐ మోహిని, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమస్యాత్మకత గ్రామాలపై దృష్టి...

నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించినట్లు డీఎస్పీ తెలిపారు. పొందూరు మండలంలో ఇప్పటి నుంచే సమస్యాత్మక గ్రామాలలో సమావేశాలు నిర్వహించి వివాదాలు లేకుండా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈసారి బైండోవర్ కేసులలో చిక్కుకుంటే రూ. 2 లక్షలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

బీసీ హాస్టళ్లను కాపాడుకుందాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సమస్యలపై పోరాడి బీసీ హాస్టళ్లను కాపాడుకుందామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు తక్షణమే స్పందించి మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, శాశ్వత భవనాలు నిర్మించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాజమహంతి భానుచందర్ తదితరులు ఉన్నారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



పట్టుబడిన నిందితులతో కాశీబుగ్గ పోలీసులు

పలాస: గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ చెప్పారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా నియోగుడ గ్రామానికి చెందిన అరబింద ఆనంద్, తబరద గ్రామానికి చెందిన మైకేల్ రైతా, సెరంగో గ్రామానికి చెందిన ప్రాతిమా లిమ్మాలను పర్లాకిమిడి మీదుగా పలాస రైల్వే స్టేషన్‌కు బుధవారం రాగా పలాస రైల్వే స్టేషన్ కూడలి వద్ద పట్టుకుని విచారించారు. వారి వద్ద 16.435 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బైక్, రెండు సెల్‌ఫోన్లు, రూ.1580 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్‌పై తరలిస్తుండగా..

ఇచ్ఛాపురం రూరల్: ఒడిశా నుంచి ద్విచక్రవాహనంపై గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. గురువారం ఇచ్ఛాపురం పట్టణ సర్కిల్ కార్యాలయంలో కవిటి ఎస్ఐ వి.రవివర్మతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కొడల గ్రామానికి చెందిన సాగర్ బెహరా, అతని స్నేహితుడు పీతల గ్రామానికి చెందిన బాలుడు రాజేష్ జెన్నాతో కలిసి గురువారం ఒడిశా నుంచి స్థానిక 16వ నెంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై 21.030 కేజీల గంజాయిని తరలిస్తుండగా కవిటి పోలీసులు కొజ్జిరియా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పట్టుకున్నారు.

విద్యార్థి ఆకస్మిక మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని కృష్ణాపార్కు సమీపంలో పకోడి కొట్టు నిర్వహిస్తున్న నిమ్మ మహేష్ కుమారుడు ప్రదీప్‌రెడ్డి(18) కళాశాలలో గురువారం నిర్వహించిన గురుపూజా మహోత్సవాలకు హాజరయ్యాడు. తీన్మార్ పెట్టడంతో విద్యార్థులంతా ఆనందంగా గడిపారు. సాయంత్రం 3.54 గంటలకు ప్రదీప్ ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే కళాశాల యాజమాన్యం నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తీన్‌మార్ డప్పులు, రెండు బాక్సుల్లో శబ్దకాలుష్యం వల్లే విద్యార్థి చనిపోయి ఉంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా, తమ కుమారుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారు. తమకు ఫిర్యాదు అందలేదని రెండో పట్టణ సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన శంకరరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఇన్‌గేట్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. రాజాం మండలం కంచరాం సమీపంలోని రాజయ్యపేటకు చెందిన గునుపూరి శంకరరావు (53) రిమ్స్ ప్రభుత్వాసుపత్రికి వైద్యచికిత్సల నిమిత్తం వచ్చాడు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడిచి వస్తుండగా టెక్కలి నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు లోపలికి వెళ్లే క్రమంలో శంకరరావును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనుక చక్రాలు కాలుపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు క్షతగాత్రున్ని బస్సు కింద నుంచి లాగి రిమ్స్‌కు తరలించారు. శంకరరావుకు భార్య రాములమ్మ, కుమార్తె ఉన్నారు. ఊరూరా తిరిగి చిరు వ్యాపారం చేస్తున్న భర్తకు ఇలా జరగడంతో తమ గతేంటని భార్య రిమ్స్ వద్ద విలపించింది. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ట్రాఫిక్ పోలీసులు నిర్ధారించారు. ఎస్ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉర్లాం వీఏఏ సస్పెన్షన్

నరసన్నపేట: ఉర్లాం సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గోలపల్లి భాస్కరరావును జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉర్లాంలో రైతుల నుంచి ఎరువు ఇస్తామని డబ్బులు వసూలు చేసి తన సొంతానికి వాడుకున్న విషయం విదితమే. ఈ మేరకు గ్రామంలో విచారణ చేపట్టిన నరసన్నపేట ఏడీ మధు నివేదిక పంపగా త్రినాథస్వామి చర్యలు తీసుకున్నారు. కాగా ఎరువుల కోసం డబ్బులు ఇచ్చిన రైతులు లబోదిబోమంటున్నారు. ఆయన నుంచి డబ్బులు వాపసు చేయాలని కోరుతున్నారు. ఇవ్వకపోతే ఆయన ఇచ్చిన రసీదులు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. కాగా రైతులు, పింఛన్‌దారుల డబ్బు సొంతానికి వాడుకున్న వీఏఏపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా పింఛన్ డబ్బులు గురువారానికీ భాస్కరరావు కట్టలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్ డబ్బు మిగిలితే వెంటనే సంబంధిత సచివాలయంలో కట్టాలి. 25 మందికి పింఛన్ ఇవ్వనట్లు యాప్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ ఆ డబ్బు రికవరీ చేయడంలో అధికారులు తాత్సారం చేస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

8న అప్రెంటిస్ మేళా

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 8న ప్రధాన మంత్రి జాతీయ అంప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎల్.సుధాకరరావు గురువారం తెలిపారు. 11 కంపెనీలలో అప్రెంటిస్ ఖాళీలు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో వివిధ ట్రేడ్‌లలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరుకావచ్చన్నారు. మైనింగ్ సొల్యూషన్ లిమిటెడ్ (పొన్నాడ), అరబిందో (పైడిభీమవరం), శ్యాంక్రగ్ పిస్టన్స్ (అరిణాం అక్కివలస), నాగార్జున అగ్రికెం లిమిటెడ్ (చిలకపాలెం), హాస్పిటల్స్ (పారామెడికల్) తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

దుర్గాదేవి నవరాత్రి పూజలు ప్రారంభం



గజపతి రాజుల ఇలవేల్పు కనకదుర్గ, కత్తి, డాలు ప్రత్యేక అలంకరణ



అంకావీధిలో మాణికేశ్వరీ దేవికి అంకపూజలు చేసి దసరా ఉత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: అంకావీధిలోని మాణికేశ్వరీ దేవికి గురువారం రాత్రి నుంచి దుర్గానవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం మాణికేశ్వరీ మందిరంలో 'అంకపూజ'లతో దుర్గా ఉత్సవాలు ప్రారంభించారు. గజపతి మహారాజుల ఇలవేల్పు మాణికేశ్వరీ, కనకదుర్గకు వారి వంశీయులు అంకపూజలు చేసి కనక దుర్గ ఆలయంలో ఉన్న కత్తిని గజపతి ప్యాలస్‌కు తీసుకువెళ్లి అష్టమి వరకు అక్కడ విజయదుర్గకి పూజలు చేస్తారు. అష్టమి తర్వాత కత్తి, డాలును తిరిగి అంకావీధిలో ఉన్న మాణికేశ్వరీ మందిరంలో యథాస్థానంలో ఉంచుతారు. మాణికేశ్వరీ గజపతి వంశీయులకు నూటయాభై సంవంత్సరాల నుంచి కోలుస్తున్నారు. గురువారం నుంచి ప్రతి రోజు అఖండ దీపాలు భక్తులు వెలిగిస్తారు.

యువరాణి కల్యాణీ దేవికి అస్వస్థత

గజపతి రాజుల వంశీయురాలు కల్యాణీ దేవికి అస్వస్థత కారణంగా గురువారం అంకపూజలకు హాజరవ్వలేకపోయారు. ఆమెకు బదులు గజపతి ప్యాలస్ ప్రధాన పూజారి విచ్చేసి అంకపూజలు, నైవేద్యం పెట్టారు.

అక్రమాలు అరికట్టాలి



ఒడిశా ఆహార కమిషన్ సభ్యులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గత మూడు రోజులుగా పర్యటిస్తున్న ఒడిశా ప్రభుత్వ ఆహార కమిషన్ సభ్యుల బృందం సభ్యులు గురువారం గజపతి కలెక్టరేట్‌లో పాలనాధికారి మధుమిత, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహార కమిషన్ సభ్యులు ప్రియవ్రత సామంతరే, అక్షయ కుమార్ బెహరా, దయానిధి దాస్ జిల్లాలోని రెండు నియోజికవర్గాల్లో పర్యటించారు. గజపతి జిల్లాలో గుమ్మా, గుసాని, మోహనా సమితిలో అనేక గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ విషయంలో అవకతవకలు సరిదిద్దాలని సభ్యులు కలెక్టర్‌తో అన్నారు. జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధీనంలో ఉన్న రేషన్ డీలర్లు ఈ-కెవైసీ అప్‌డేట్ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలు, విద్యాలయాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉద్యోగులు ఆలసత్వం వహిస్తున్నారన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం, రాష్ట్ర ఆహార భద్రత పథకం సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమావేశానికి ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా ముఖ్య శిక్షాధికారి డాక్టర్ మాయాదర్ సాహు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సల్మాన్ రైకా, జిల్లా ముఖ్యచికిత్సాధికారి, డాక్టర్ ఎం.ఎం.ఆలీ, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి సరలా పాత్రో, అదనపు పౌరసరఫరాల శాఖ అధికారి సుహాన్ భుయి, ఐ.సి.డి.ఎస్ అధికారులు పాల్గొన్నారు.

విరిగిపడిన కొండ చరియలు



అజయగడ వద్ద కొండచరియలు రోడ్డుకు అడ్డంగా పడిన దృశ్యం



ఎత్తైన అజయ గడ కొండ చరియలు విరిగి పడిన దృశ్యం

పర్లాకిమిడి: ఇటీవల కురిసిన వర్షాలకు అజయగడ గ్రామం వద్ద కొండ చరియలు విరిగిపడి అనేక గ్రామాలకు ఇబ్బంది కలిగింది. గురువారం ఉదయం అకస్మాత్తుగా అజయగడ ఘాట్ సెక్షన్ వద్ద కొండచరియలు జారి రోడ్డుకు అడ్డంగా పడటంతో అనేక గ్రామాలకు ఆటంకం కలిగింది. వెంటనే గ్రామస్తులు గుమ్మా బ్లాక్ అధికారులకు సమాచారం అందజేశారు. గతంలో కూడా అజయగడ గ్రామం వద్ద కొండచరియలు విరిగి పడ్డాయి. ఘాట్ రోడ్డు వద్ద ప్రొటెక్షన్ వాల్ లేకపోవడం వల్లే ఇలా జరుగుతోందని బ్లాక్ అధికారులు అంటున్నారు.

దయనీయ స్థితిలో పశు చికిత్స కేంద్రం



పిచ్చి మొక్కల మధ్య పశు చికిత్స కేంద్రం



పునాది గోతులకే పరిమిత మైన భవన నిర్మాణం



శిథిలావస్థలో పశు చికిత్సా వైద్య కేంద్రం

జయపురం: జయపురం సబ్‌డివిజన్ పశు చికిత్స కేంద్రం దయనీయ స్థితిలో ఉంది. ఐదు ఎకరాలకుపైగా ఉండాల్సిన కేంద్రం ఇప్పుడు రెండున్నర ఎకరాలకు పరిమితమైంది. 26వ జాతీయ రహదారి పక్కన గల పశు చికిత్సా కేంద్రం ముందు పలు దుకాణాలు ఏర్పడటంతో పశువులకు ఉంచడానికి స్థలం సరిపోవడం లేదు. పశు చికిత్స కేంద్రానికి నిధులు మంజూరైనా పనులు జరగలేదు. ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైపోతోంది.



రూఫ్ ఎగిరిపోయిన భవనాలు

క్లుప్తంగా

మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయండి

● కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాలకు సెప్టెంబర్ నెలాఖరుకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. తన చాంబర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా సంక్షేమ హాస్టళ్లకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న 11 హాస్టళ్లలో ఆర్‌డబ్ల్యూఎస్, పట్టణ ప్రాంత హాస్టళ్లల్లో పబ్లిక్ హెల్త్ విభాగం వారు మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 39 హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని 149 హాస్టళ్లలో ఎన్ని చోట్ల మరుగుదొడ్లు అవసరమన్నది సర్వేచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్.కవిత, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారిణి అన్నపూర్ణ, బీసీ సంక్షేమ శాఖాధికారిణి జ్యోతిశ్రీ, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి హుండీల ఆదాయం లెక్కింపు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి వనంగుడి, చదురుగుడి హుండీల ఆదాయాన్ని గురువారం పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపంలోను, వనంగుడి ఆవరణలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కె.శిరీష మాట్లాడుతూ 44 రోజులకు గాను చదురుగుడి హుండీల నుంచి రూ.15 లక్షల 62వేల 461 నగదు, 12 గ్రాముల350 మిల్లీ గ్రాముల బంగారం, 216 గ్రాముల వెండి లభించాయన్నారు. అదేవిధంగా వనంగుడి హుండీల నుంచి రూ.3 లక్షల 64వేల 803 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.8750 ఆదాయం లభించిందన్నారు. భక్తులు ఆలయ అభివృద్ధికి మరింత సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వైవీ.రమణి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

విజయనగరం లీగల్: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో వాహన ప్రమాదాలు, బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎన్ఐఏ, ఎక్సైజ్ కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత సివిల్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చన్నారు. పూల్‌బాగ్ కాలనీ హనుమాన్ నగర్‌లోని ఎంఆర్‌పీజీఆర్ పీజీ బాయ్స్ హాస్టల్ ప్రాంగణంలోని నూతన కోర్టు భవనంలో ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆయన చూపు సజీవం



బీఎస్ అప్పల నాయుడు (ఫైల్)

చీపురుపల్లి: బతికున్నప్పుడు మాత్రమే కాదు మరణించిన తరువాత కూడా చూపు సజీవంగా ఉండాలంటే నేత్రాలు దానం చేయాలి. ప్రతి మనిషి మరణానంతరం శరీరంతో పాటు అవయవాలు కూడా కాలి బూడిదవ్వాల్సిందే. కానీ ఆ చూపు సజీవంగా ఉండాలంటే మాత్రం నేత్రాలు దానం చేయాలి. పట్టణంలోని మెయిన్‌రోడ్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బీఎస్.అప్పలనాయుడు కుటుంబసభ్యులు అదే పని చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పట్టణంలోని ఆంజనేయపురానికి చెందిన బీఎస్.అప్పలనాయుడు(86) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. దీంతో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు నేత్రదానం చేయాలంటూ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. దీనికి వారు అంగీకరించడంతో విజయనగరం రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం ఇవ్వగా అక్కడి నుంచి టెక్నీషియన్ రమణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి నుంచి కార్నియా సేకరించారు.

పారిశుధ్య వాహనాలు ప్రారంభం

విజయనగరం: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనుల కోసం కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలను ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు నగరంలో గురువారం ప్రారంభించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా రూ.3.57 కోట్ల వ్యయంతో ఓ జేసీబీ, రెండు కాంపాక్టర్ వాహనాలు సహా ఎనిమిది ట్రాక్టర్లు కొనుగోలు చేయడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకుని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమ లక్ష్యం నెరవేరేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వరం ఈ-శ్రమ్



జిల్లా కార్మిక శాఖ కార్యాలయం



ఈ-శ్రమ్ కార్డులు



అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ నమోదు చేస్తున్న కార్మిక శాఖ సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: శ్రామికులకు వెన్నుదన్ను..విపత్కర వేళ తోడుగా నిలిచేది ఈ-శ్రమ్ కార్డు. అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ-శ్రమ్ కార్డు పొందడం పూర్తిగా ఉచితమైనా అవగాహన లోపం వల్ల చాలా మంది ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారు. టైలర్లతో సహా చాలా రంగాలకు చెందిన శ్రామికులు ఈ-శ్రమ్ కార్డు పొందడానికి అర్హులు. నమోదు కూడా సులభం. ఈ-శ్రమ్‌లో నమోదైన కార్మికులు, వలస కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పలు ప్రయోజనాలు వర్తిస్తాయి. ఈ డేటాబేస్ ఆధారంగా ఉపాధి,నైపుణ్యాభివృద్ధి కల్పిస్తారు. నిజంగా శ్రామికుల పాలిట' ఈ-శ్రమ్' ఓ వరం వంటిదని చెప్పవచ్చు. కార్మికశాఖ ఎంత కసరత్తు చేస్తున్నా ఇంకా పెద్ద సంఖ్యలో కార్మికులు ఈ-శ్రమ్ కార్డు పొందలేదు. ఈ-శ్రమ్ నమోదు కోసం ప్రత్యేకంగా ఆగస్టు 25 తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

కార్డు ఎలా పొందాలి?

ఈ-శ్రమ్ కార్డు పొందడం చాలా సులభం. కంప్యూటర్‌పై అవగాహన ఉన్నవాళ్లు 'ఈ-శ్రమ్' వెబ్‌సైట్‌లోకి వెళ్లి సొంతంగా ప్రక్రియ పూర్తి చేయవచ్చు. సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు, మీ-సేవ, సీఎస్‌సీ సెంటర్లలో వివరాలను నమోదు చేసుకుని కార్డు పొందవచ్చు. బ్యాంకు అకౌంట్ నంబర్, అకౌంట్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆధార్ కార్డు, ఫొటో ఉంటే సరిపోతాయి. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత సెల్ నంబర్‌కు మెసేజ్ వస్తుంది. కార్డును ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది.

అర్హులెవరంటే..?

అసంఘటిత రంగానికి చెందిన కార్మికులు, వలస కార్మికులు, చిన్న, సన్నకారు, కౌలు రైతులు, కూలీలు, పశుపోషణ, వడ్రంగి, ఉప్పు తయారీ, ఇటుకబట్టీ, రాతి క్వారీ కార్మికులు, పనిమనుషులు, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, చేతివృత్తుల వాళ్లు, వీధి వ్యాపారులు, ఆశ, అంగన్వాడీ వర్కర్లు, టైలర్లు, మత్స్యకారులు, నర్సరీ కూలీలు, ఉపాధి కూలీలు, భవననిర్మాణ కార్మికులు, పాల వ్యాపారులు, కొరియర్, పేపర్ బాయ్స్, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, సెరికల్చర్, హమాలీలు, హోంమెయిడ్స్, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లో సభ్యత్వం లేనివారు, ఆదాయపు పన్ను పరిధిలో లేనివాళ్లు అర్హులు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలి.

నగదు వసూలు చేస్తే చర్యలు..



ఈ-శ్రమ్ పథకంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటివరకు ఏడుగురికి ప్రమాద బీమా పరిహారం అందజేశాం. ఒక ఇంటిలో ఎంత మంది ఉన్నా ఈ పథకానికి అర్హులే. కార్మికుల పేర్ల నమోదుకు కామన్‌సర్వీస్ సెంటర్లు, సచివాలయాల్లో నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ-శ్రమ్ కార్డు అందించి త్వరలోనే లక్ష్యాన్ని చేరుకుంటాం.

-ఆర్.రమాదేవి, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్, విజయనగరం జిల్లా

కోళ్ల మరణాలను ఆపేందుకు సస్యరక్షణ చర్యలే మార్గం..

● పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు

సాక్షి ఎఫెక్ట్



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు

కొత్తవలస: కొత్తవలస సబ్‌డివిజన్ పరిధిలో కొత్తవలస, లక్కవరపుకోట మండలాలతో పాటు చుట్టుపక్కల మండలాల్లో ఇటీవల లక్షకుపైగా పౌల్ట్రీ, నాటుకోళ్ల మృత్యువాత పడుతున్నాయని ఈ మరణాలను అరికట్టేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ఒక్కటే మార్గమని పశువర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.దామోదరరావు అన్నారు. ఈ మేరకు కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో వింత వ్యాధితో లక్షకుపైగా కోళ్ల మృతి శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కొత్తవలస ఏ.డి కార్యాలయంలో రెండు మండలాల పశువైద్యాధికారులు, సచివాలయం పశుసహాయకులతో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. చనిపోయిన కోళ్ల నమూనాలను పరీక్ష నిమిత్తం విజయవాడ సెంట్రల్ లేబొరేటరీకి పంపించామని వ్యాధి నిర్ధారణ నివేదికలు రాలేదని డీడీ తెలిపారు. ఈ సందర్భంగా డీడీ దామోదరరావు మాట్లాడుతూ లక్షకు పైగా కోళ్లు మృతి చెందడం వాస్తవమేనన్నారు. పౌల్ట్రీల్లో మరో రెండు నెలల వరకు కొత్త పిల్లలను పెంచవద్దని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి పక్షులు చనిపోయినా గ్రామానికి దూరంగా గొయ్యి తీసి పాతిపెట్టాలని చెప్పారు. పౌల్ట్రీల్లో పనిచేసే కార్మికులు మిగిలిన కోళ్లకు వైరస్ సోకకుండా ఉండేందుకు శానిటైజేషన్ చేయాలన్నారు. ఈ జాగ్రత్తలపై గ్రామాల్లో దండోరా వేసి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏ.డి కన్నంనాయుడు, రెండు మండలాల పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

'సూపర్ స్కూల్'గా జ్యోతిబాపూలే బాలికల పాఠశాల



సూపర్ స్కూల్‌గా ఎంపికైన ప్రశంశాపత్రం, మెమెంటోను చూపిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో గల మహాత్మా జోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలల్లో రాష్ట్రస్థాయిలో సూపర్ స్కూల్ కేటగిరి-ఎలో ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో గురువారం తెలిపారు.ఈ మేరకు 3వ తేదీన విజయవాడలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల కార్యదర్శి మాధవీలత చేతుల మీదుగా ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత,ఈ ఏడాది పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకీ ఎంపిక కావడం, పాఠశాలలో గ్రంథాలయం నిర్వహణ, పర్యావరణ హిత ప్రాజెక్టులు తదితర అంశాల్లో మిగిలిన బీసీ గురుకుల విద్యాలయ సంస్థలకు భిన్నంగా నిర్వహించడం వల్ల ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా ఈ ఘనత సాధనకు కృషిచేసిన బోధనా సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

చదువుకున్న చోటే బోధన

పార్వతీపురం రూరల్: విద్యార్థి జీవితంలో కళాశాల జ్ఞాపకాల నిలయం. ఇక్కడ నేర్చుకున్న పాఠాలు, అనుభవాలు జీవితాంతం మార్గ నిర్దేశం చేస్తాయి. ఆ విద్యార్థుల్లో కొందరు మాత్రమే ప్రతిభ, కృషి నిబద్ధతతో భవిష్యత్‌లో గురువులుగా మారుతారు. విద్యార్థిగా తరగతి గదిలో కూర్చుని గురువు వెలిగించిన జ్ఞాన దీపంతో మంచి మార్గంలో నడుస్తూ గతంలో కళాశాల తరగతి గదుల్లో పాఠాలు నేర్చుకున్న వారే అదే తరగతి గదుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తూ అధ్యాపకులుగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తూ పలువురికి ఆదర్శనమవుతున్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా, ఎకనామిక్స్ అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారు గతంలో ఇదే కళాశాలలో ఇంటర్‌మీడియట్ పూర్తిచేశారు. ప్రస్తుతం వారు చదువుకున్న చోటే ప్రిన్సిపాల్‌గా ఒకరు, అధ్యాపకుడిగా మరొకరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నేడు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వారు చదువుకున్న ఆనాటి జ్ఞాపకాలను వారి మాటల్లో తెలుసుకుందాం.

నాడు విద్యార్థిగా నేడు ప్రిన్సిపాల్‌గా



మా స్వగ్రామం సీతానగరం మండలం మరిపివలస కావడంతో రోజూ ఉదయం 8గంటలకు కళాశాలకు సైకిల్‌పై స్నేహితులతో కలిసి చేరుకునేవాళ్లం. సాయంత్రం 6గంటల వరకు కళాశాలలోనే ఉండే వారం. నాకు తక్కువ మార్కులు వచ్చిన కారణంగా ఎంపీసీలో సీటు ఆశించినప్పటికీ బైపీసీలో సీటు దక్కింది. ఈ కళాశాలలో విద్యార్థిగా జీవితానికి ఉపయోగపడే చాలా పాఠాలు నేర్చుకున్నాను. ఊహించని రీతిలో ఇదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తానని అనుకోలేదు. 1990లో ఈ కళాశాలలో ఇంటర్‌మీడియట్ పూర్తిచేశాను. అనంతరం 2003లో బోటనీ అధ్యాపకుడిగా కళాశాలకు వచ్చి నేడు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించడం, చదువుకున్న చోటే ఉద్యోగం చేయడం ఆసక్తిగా ఉంది. – ఆకుల రాజు, ప్రిన్సిపాల్, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల

6 నుంచి ఇంటర్ వరకు



మా నాన్నగారు ఇదే కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేసేవారు. ఈ క్రమంలో 1978 నుంచి 1985 వరకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇదే కళాశాలలో చదువుకున్నాను. అయితే ఇదే కళాశాలలో ప్రస్తుతం ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేసే అవకాశం కలగడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. ఒకప్పుడు నేను కూర్చుని విద్యాబుద్ధులు నేర్చుకున్న చోటే అధ్యాపకుడిగా బోధన చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు.

-టి.రవికుమార్, గుమ్మలక్ష్మీపురం

మాటలకే పరిమితమైన మంత్రి హామీలు



కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జగన్నాథపురానికి వెళ్లే మట్టిరోడ్డు..బయటకొచ్చేసిన పైపు కల్వర్టులు

మెంటాడ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జగన్నాథ పురానికి వెళ్లేమార్గంలో ఉన్న తాత్కాలిక పైపు కల్వర్టు పైన ఉన్న మట్టి మొత్తం కోతకు గురైంది. పైపులు మాత్రమే మిగిలాయి. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జనసేన నాయకులు ఎన్నికల ముందు జగన్నాథపురం గ్రామానికి ఆంధ్ర ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి తారురోడ్డు, చంపావతి నదిపై బ్రిడ్జి నిర్మిస్తామని ముమ్మర ప్రచారం చేశారు. గుమ్మడి సంధ్యారాణి అయితే ఒక అడుగు ముందుకేసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పదవి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు జగన్నాథపురం యువత 12 సార్లు ఆమెకు దరఖాస్తులు ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదు. రోడ్డు, బ్రిడ్జి గురించి ప్రశ్నిస్తే గ్రామంలోని కూటమినేతలు ఇదుగో..వస్తుంది అదుగో..వస్తుంది అని చెప్పుకువస్తున్నారు. సూపర్ సిక్స్ హామీల్లాగానే ఈ హామీ కూడా గాలిలో కలిసి పోతుందేమోనని ఇక్కడి ప్రజలు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.

యూరియా అందక వెనుదిరిగిన అన్నదాతలు



యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి సచివాలయానికి బుధవారం రాత్రి 150 బస్తాల యూరియా వచ్చింది. ఈ యూరియాను రేగ, కళ్లేపల్లి, పూడివానిపాలెం, సీతాగొర్లెవానిపాలెం, శ్రీరాంపురం, తామరాపల్లి గ్రామాలకు చెందిన రైతులకు అందజేస్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. దీంతో పెద్ద ఎత్తున రైతులు గురువారం ఉదయం 9 గంటలకే సచివాలయం ముందు క్యూ కట్టారు. ఇంతలో కూటమి నాయకులు సచివాలయం వద్దకు చేరుకుని వారికి నచ్చిన వారికి యూరియాను అందజేశారు. దీంతో ఉదయం నుంచి లైన్‌లో నిల్చున్న రైతులకు యూరియా దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని వాపోయారు. రైతులను ఉసురు పెట్టిన ప్రభుత్వాలు ఎంతకాలం పాలన చేయలేవంటూ రైతులు శాపనార్థాలు పెట్టారు.

పరిశ్రమల స్థాపనకు సులభంగా అనుమతులు

● జేసీ సేతు మాధవన్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసిన వారికి అనుమతులివ్వాలని జేసీ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. గతేడాది సింగల్ డెస్క్ పోర్టల్‌లో 2,257 దరఖాస్తులకు అనుమతులిచ్చి రాష్ట్రంలోనే జిల్లా ఉత్తమ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై గురువారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటును అధికారులు ప్రోత్సహించాలన్నారు. కేపీఎమ్జీ సంస్థ కన్సల్టెంట్ రవితేజ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ర్యాంక్ రావడానికి తోడ్పడే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈఓడీబీపై కేంద్ర ప్రభుత్వం సర్వేచేస్తోందని, దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ వస్తాయని, వారు అన్ని శాఖల నుంచి అందిన సహకారంపై వారి అభిప్రాయాన్ని పాజిటివ్‌గా చెప్పేలా పనిచేయాలన్నారు. ఈఓడీబీలో మంచి ర్యాంక్ వస్తే ప్రభుత్వం నుంచి పరిశ్రమల స్థాపనకు ఎక్కువ సహకారం అందుతుందన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ కరుణాకర్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నెల్లిమర్ల: స్థానిక డైట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ జయరాం గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యనందివ్వడంతో పాటు పౌష్టికాహారం అందేలా చూడాలని సిబ్బందికి వారు తెలిపారు. జంగిల్స్, మురుగు ఉండకుండా చూడాలన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం గంటస్తంభం: స్థానిక ఎస్‌డబ్ల్యూసీ మార్కెట్ కమిటీ ప్రాంతంలో సీఐటీయూ జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అన్ని రంగాల కార్మికులు, చిరుద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపడుతున్న ఈ సభలకు అందరూ వచ్చి, విజయవంతం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ కోరారు.

వ్యక్తి గల్లంతు



గల్లంతైన గిరడ రాజు



గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్

విజయనగరం క్రైమ్: నగరంలోని అయ్యన్నపేట వద్ద ఓ వ్యక్తి అదృశ్య మయ్యాడని విజయనగరం వన్ టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఈ మేరకు సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయ్యన్నపేటకు చెందిన గిరడ రాజు(34) గణేష్ నిమజ్జనానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టామన్నారు. వినాయక నిమజ్జనంతో చెరువులోకి వెళ్లిన రాజు జాడ కానరాకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్‌తో గాలింపు చేపడుట్టామని సీఐ చౌదరి తెలిపారు.

ప్రాణాలు తీసేస్తున్న డీజేలు

● శ్రుతిమించుతున్న శబ్దాలు



హరీష్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: ఆనందాలు కాస్త ఆవిరవుతున్నాయి. సరదాలు మితిమీరుతున్నాయి. పండగలు ప్రాణాలు తీస్తున్నాయి. సాంస్కృతిక వైభవం చాటాల్సిన కార్యక్రమాల్లో విషాద ఛాయలు అలముకుంటున్నాయి. మారుతున్న కాలంలో సంప్రదాయాలను చాటిచెప్పాల్సిన పండగలలో సమష్టి కృషి, సమైక్య పనితనం మచ్చుకైనా కానరావడం లేదు. ఖర్చులు పెడుతున్నామనే భావన తప్ప భక్తి, ఆ పై సంస్కృతి పరిఢ విల్లడం లేదు. విజయనగరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వారం రోజులుగా అయిదు పోలీస్ స్టేషన్ల పరిధిలో అలాంటి ఘటనలే జరుగుతుండడం దారుణం. ఇటీవల విజయనగరం వన్ టౌన్ స్టేషన్ పరిధి కొత్త దుప్పాడలో ఓ యువకుడి ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది. వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో పెట్టిన భారీ శబ్దాలు (డీజే) ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకుడిని బలిగొన్నాయి. నిన్న కాక మొన్న విజయనగరం వన్ టౌన్ స్టేషన్ పరిధిలో ఒకటి, టూటౌన్ పీఎస్ లో ఒకటి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరు వినాయక నిమజ్జనాల్లో పాల్గొని సంబ్రమాశ్చర్యాల్లో మునిగి చివరకు కన్నవారికి దూరమయ్యారు. తాజాగా విజయనగరంలోని బొబ్బాదిపేటకు చెందిన బొబ్బాది హరీష్ (22) వినాయక నిమజ్జనం సందర్భంగా డీజే సౌండ్స్‌కు బుధవారం రాత్రి డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. డిగ్రీ పూర్తి చేసిన హరీష్ పోటీ పరీక్షలకు కోచింగ్ నిమిత్తం హైదరాబాద్ వెళ్లేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో ఈ దారుణ ఘటన జరిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాద స్థలంలో మృతిచెందిన అర్జున రావు

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో రంగరాయపురం జంక్షన్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపాడ మండలం చామలాపల్లి గ్రామానికి చెందిన పెద్దాడ అర్జునరావు మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భార్య, కుమారుడితో కలిసి విశాఖ జిల్లా చిన్న ముషిడివాడలో అర్జునరావు నివాసముంటున్నాడు. తమ స్వగ్రామంలో వినాయక నిమజ్జన మహోత్సవానికి బైక్‌పై వెళ్తుండగా రంగరాయపురం జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టిన అర్జునరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు.

బొలెరో ఢీకొని యువకుడు..



సాయి మృతదేహం

బొండపల్లి: మండలం కేంద్రం లోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన కు సంబంధించి ఎస్సై యు. మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం నుంచి మక్కువకు ముగ్గురు యువకులు బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించే క్రమంలో బొలెరోను బలంగా ఢీ కొట్టడంతో ప్రమాదంలో బైక్‌పై కూర్చున్న దాసరి సాయి(20)తీవ్రంగా గాయపడి విజయనగరంలోని కేంద్ర సర్వ జన ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఆవాల రాజేష్ బైక్ నడుపుతూండగా, వెనుక ఎస్.రఘు ఉన్నాడు. గాయపడిన వారిద్దరినీ చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తునట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సుల అడ్డగింత



ర్యాలీగా వెళ్తున్న ఆటో యూనియన్ కార్మికులు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులను అడ్డుకుంటున్న ఆటో కార్మికులు

- ఆందోళనకు దిగిన ఆటో కార్మికులు
- యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా
- నెలకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్

బొబ్బిలి: ఆటో కార్మికుల ఉసురు తీయవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, ఆటో కార్మికుల యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులను అడ్డగించి నిరసన చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ వద్ద నిరసన ప్రదర్శన చేపడుతున్నప్పుడు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు అటు వైపు వెళ్లడంతో కార్మికులు అడ్డుకున్నారు. డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా పొట్నూరు శంకరరావు, ఆటో కార్మికుల సంఘం నాయకులు ఎ.మోహనరావు, బీటీఆర్ గంగరాజు, వీరన్న, జయరాం తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తచట్టాలతో భారీ జరిమానాలు విధిస్తోందన్నారు. బీఎన్ఎస్ 106లోని పలు సెక్షన్ల ప్రకారం ఆటోలను నడపడమే కష్టతరంగా మారిందని వాపోయారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం పుండుపై కారం జల్లినట్టు ఫ్రీ బస్సు ప్రవేశపెట్టిందని, దీంతో మహిళలెవరూ ఆటోలు ఎక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

వేదాంతకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి

అంతే కాకుండా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న రాష్ట్రం దానిని అసలు పట్టించుకోకుండా వేదాంత సంస్థకు ఫిట్‌నెస్, బ్రేక్ సర్టిఫికెట్ల జారీ బాధ్యతను అప్పగించడం వల్ల ఆటో కార్మికులంతా అదనపు భారాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ పట్టణమంతా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కార్మికులంతా పెద్దపెట్టున నినదించారు. తమ సమస్యలను పరిష్కరిస్తామన్న చంద్రబాబు,పవన్ కల్యాణ్‌లు పత్తాలేకుండా పోయారన్నారు. వేదాంత సంస్థకు ఇచ్చిన బ్రేక్, ఫిట్‌నెస్ అనుమతులను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపును ప్రభుత్వమే భరించాలని, వెంటనే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 17న జిల్లా బంద్ చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ పట్టించుకోకపోతే ఈనెల 19న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ ఎం శ్రీనుకు మెమొరాండం అందజేశారు. కార్యక్రమంలో ఆటో కార్మికుల సంఘం నాయకులు త్రినాథ, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్సై పి జ్ఞానప్రసాద్, సిబ్బంది ఆటో కార్మికులు బస్సులకు ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకున్నారు.